## క్లుప్తంగా

### ఆలయానికి రూ.2.21లక్షల ఆదాయం

**తిరుమలగిరి(జగ్గయ్యపేట):**దసరా పండుగ సందర్భంగా తిరుమలగిరి వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. దర్శనం టికెట్లు, లడ్డూ విక్రయాలు, అన్నదానం విరాళాల ద్వారా ఆలయానికి రూ. 2.21 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో వరప్రసాద్ ఆదివారం తెలిపారు.

### ఎమ్మెల్యేను కలిసిన దేవరాజ్

**జగ్గయ్యపేట అర్బన్:** సోషల్, ట్రైబల్, బీసీ వెల్ఫేర్ విద్యాసంస్థలు(పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు)పై స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా ఎంపికైన పట్టణానికి చెందిన గుండిపాగ జాన్సన్ దేవరాజ్ ఆదివారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ను కలుసుకున్నారు. ఈసందర్భంగా జగ్గయ్యపేట ప్రాంతంలో కళాశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కోసం హాస్టళ్ల ఏర్పాటుకు కృషిచేయాలని ఎమ్మెల్యే ఆయనను కోరగా, అందుకు తగిన సహకారం అందిస్తానని దేవరాజ్ తెలిపారు.

### నేడు గ్రామాల్లో పల్లె పండుగ

**చిల్లకల్లు(జగ్గయ్యపేట):**మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నితిన్ తెలిపారు. చిల్లకల్లు, తిరుమలగిరి గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొంటారని వివరించారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

### ప్రత్యేక పూజలు



**జగ్గయ్యపేట:** దసరా శరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గౌరవరం, జయంతిపురం, వేదాద్రి, ముక్త్యాల, చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట, అనుమంచిపల్లి గ్రామాల్లోని అమ్మవారి విగ్రహాలను పూజల అనంతరం ప్రత్యేక వాహనాలలో ఊరేగింపుగా వేదాద్రి, ముక్త్యాల వద్ద కృష్ణానదిలో నిమజ్జనానికి తరలించారు.

**వీరులపాడు మండలంలో...**

**వీరులపాడు:** విజయదశమి పండుగను మండల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు. అమ్మవార్లను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారి విగ్రహాలను ఉంచి నిమజ్జనానికి తరలించారు.

### నేడు మద్యం షాపులకు లాటరీ

**జగ్గయ్యపేట:** ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 10 మద్యం దుకాణాలను సోమవారం విజయవాడలోని ఎస్‌పీసీ ఫంక్షన్ హాల్‌లో లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు సీఐ గురవయ్య సర్కిల్ పరిధిలోని 10 దుకాణాలకు 707 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వివరించారు.

# జోరుగా ఇసుక అక్రమ రవాణా

- అటకెక్కిన ఉచిత ఇసుక హామీ
- యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- సొమ్ముచేసుకుంటున్న కూటమి నేతలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ప్రభుత్వాదాయానికి భారీగా గండి

**పెనుగంచిప్రోలు:** మండలంలో ఇసుక అక్రమరవాణా జోరుగా సాగుతోంది. ముఖ్యంగా పెనుగంచిప్రోలు మండలం శనగపాడు, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు గ్రామాల్లో మునేరు నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ముందుగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తోటలు, ఖాళీస్థలాల్లో డంప్ చేసి అనంతరం రాత్రుళ్లు లారీల ద్వారా తెలంగాణకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తాము అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా అందజేస్తామంటూ ఎన్నికల సమయంలో హామీలు ఇప్పించిన టీడీపీ కూటమి నేతలు..అధికారం చేపట్టాక ఉచితం సంగతి దేవుడెరుగు కనీసం డబ్బులు చెల్లించినా ఇసుక దొరకని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పనుల్లేక కార్మికుల అవస్థలు

ఓవైపు అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను అక్రమ రవాణా చేస్తుండగా, మరోవైపు ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో పనుల్లేక భవన నిర్మాణకార్మికులు ఖాళీగా ఉండాల్సిన దుస్థితి నెలకొంది.



అనిగండ్లపాడు ఇసుక రీచ్‌కు వెళ్లేందుకు రోడ్డు కోసం తోలిన మట్టికుప్పలు



శనగపాడు నుంచి ఇసుకను తరలిస్తుండగా నందిగామ పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీలు, కారు(ఫైల్)

### అధికారుల ఉదాసీన వైఖరి..

పోలీస్, రెవెన్యూ అధికారుల ఉదాసీన వైఖరి కారణంగానే ఇసుక అక్రమరవాణా మూడు ట్రాక్టర్లు.. ఆరు లారీల్లా సాగుతోంది. శనగపాడు ఇసుక క్వారీ నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంప్ చేసి రాత్రుళ్లు లారీల్లో హైదరాబాద్‌కు పెద్దఎత్తున రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీస్, రెవెన్యూ వర్గాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు నామమాత్రపు దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారు. వారంరోజుల కిందట నందిగామ పోలీసులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను అనాసాగరం వద్ద స్వాధీనం చేసుకున్నారు. అక్రమార్కులు ఈ ఇసుకలారీలను తెలంగాణకు తరలించేందుకు మధ్యలో ఎటువంటి అవాంతరాలు లేకుండా ఓ కారును పైలెట్ వాహనంగా వినియోగిస్తుండటం గమనార్హం. అలాగే గత నెల 29న శనగపాడు నుంచి తోటచర్లకు రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పెనుగంచిప్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనిగండ్లపాడు రీచ్ నుంచి రోజూ రాత్రి సమయంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక రవాణా సాగుతుండటం ఈ అక్రమరవాణాకు నిదర్శనం.

### రోడ్డు ఏర్పాటు చేసుకుని మరీ..

ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తులు ఓ ట్రాక్టర్ ఇసుకకు దూరాన్ని బట్టి రూ.2,500 నుంచి రూ.3వేల వరకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా కోసం మునేరులో ఏకంగా ఎర్రమట్టితో రోడ్డు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. గుమ్మడిదుర్రులో కూడా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. మామిడి తోటల్లో డంప్ చేసి గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ, పోలీసు అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. కొందరు వ్యక్తులు మునేరు వరదకు పొలాల్లో మేట వేసిన ఇసుకను తరలిస్తుండటంతో పొలాలకు వేసిన పైపులైన్లు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఇకనైనా రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్టవేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మునేరు నుంచి ఇసుక అక్రమరవాణా కారణంగా రోడ్లు దెబ్బతింటున్నాయని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలంటూ టీడీపీ కూటమి నేతలే పోలీసులకు వినతిపత్రం అందజేయడం కొసమెరుపు.

### ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

**కంచికచర్ల(వీరులపాడు):**కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామంలోని కృష్ణానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు..సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడిచేసి మోగులూరు గ్రామానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

### రథశాల నిర్మాణానికి శంకుస్థాపన



**నందిగామ టౌన్:** స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయ రథశాల షెడ్డు నిర్మాణానికి నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివారం శంకుస్థాపన చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాజా వాసిరెడ్డి మురళీరాఘవకుమార్ సొంత నిధులు రూ.10లక్షలతో రథశాల షెడ్డు నిర్మాణ చేపట్టగా, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

# శ్రీను మృతికి టీడీపీ నాయకులే కారణం

మృతుని కుటుంబసభ్యులు

**జగ్గయ్యపేట అర్బన్:** పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ఆర్‌వో ప్లాంట్‌లో ఈనెల 11వతేదీన వైఎస్సార్ సీపీ కార్యకర్త గుగ్గిళ్ల శ్రీను ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శనివారం పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నా, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి లాహోరి బద్దూనాయక్, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం ట్రస్ట్ బోర్డు సభ్యుడు నంబూరి రవి, జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి షేక్ జుబేర్ తదితరులు పేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లి శ్రీను మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు.

**టీడీపీ వారే వేధింపులే కారణం..**

శ్రీను మృతికి టీడీపీ నాయకుల వేధింపులు, దౌర్జన్యమే కారణమని మృతుడి తల్లి నాగమణి, భార్య గోవిందమ్మ తెలిపారు. టీడీపీ నాయకులు అధికారదర్పంతో తమ వీధిలో 30ఏళ్లుగా ఉన్న ఓ విద్యుత్‌స్తంభాన్ని అక్కడి నుంచి తొలగించి తమ ఇంటి ఎదుట ఏర్పాటు చేయడంతో శ్రీను మన స్తాపానికి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు వివరించారు. శ్రీను మృతికి టీడీపీ కార్యకర్తలు వీర్ల వెంకన్న, వీర్ల సరస్వతి, షేక్ చాందూ, షేక్ బడేబీ, షేక్ బాషి, షేక్ రహంతుల్లా, మద్దెల నాగబాబు, మద్దెల నరసింహారావు, కౌన్సిలర్ గొట్టె నాగరాజు, మాజీ కౌన్సిలర్ కావేటి కృష్ణ కారకులని ఆరోపించారు. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**న్యాయం జరిగే వరకు పోరాటం..**

ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి చిన్నా స్థానిక పోలీసులతో మాట్లాడారు. గుగ్గిళ్ల శ్రీనును ఆత్మహత్యకు పురికొల్పిన నిందితులపై కేసు నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు వద్దని చెప్పినప్పటికీ టీడీపీ నాయకులు వినిపించుకోకుండా శ్రీను ఇంటి వద్దనే విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో శ్రీను మనస్తాపంతో మృతిచెందారన్నారు. మృతుడి తల్లిని కూడా దుర్భాషలాడి దౌర్జన్యం చేశారన్నారు. టీడీపీ నాయకుల అరాచకానికి ఈ ఘటనే నిదర్శమని మండిపడ్డారు. శ్రీను మృతికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చాపల వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పింగళి నరసింహారెడ్డి, మెట్టు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి చిన్నా



టీడీపీ వారి దౌర్జన్యాలను వివరిస్తున్న మృతుడు శ్రీను తల్లి నాగమణి, భార్య గోవిందమ్మ

### శ్రీను కుటుంబానికి అండగా ఉంటాం : దేవినేని అవినాష్

**జగ్గయ్యపేట అర్బన్:** 'కూటమి రాక్షస ప్రభుత్వం ఎంబీకేలు, మధ్యాహ్న భోజన కార్మికులు వంటి చిన్న చిన్న ఉద్యోగులు, నాయకులపై తమ ప్రతాపాన్ని చూపుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. గుగ్గిళ్ల శ్రీను బీసీ వర్గంలో చురుకైన కార్యకర్తగా ఎదుగుతుంటే వేధింపులకు గురిచేసి పొట్టనపెట్టుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు ఏ అన్యాయం జరిగినా పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు అండగా ఉంటారని స్పష్టం చేశారు. శ్రీను ఆత్మహత్యకు కారకులైన దోషులను పోలీసులు వెంటనే కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రతి రోజూ రాత్రి ఉండదని, పగలు కూడా వస్తుందని గుర్తుచేశారు. వచ్చే తమ పాలనలో తాము కూడా దాడుల చేస్తే మీరు తట్టుకోలేరని హెచ్చరించారు. పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రోడ్ క్రాసింగ్ కావడంతో విద్యుత్ స్తంభాన్ని మార్చడం కుదరదని విద్యుత్ శాఖ అధికారులు చెప్పినప్పటికీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికార మదంతో రెచ్చిపోయి శ్రీనుపై, వారి కుటుంబ సభ్యులపై దౌర్జన్యానికి పాల్పడుతూ అతను చనిపోవడానికి పరోక్షంగా కారకులయ్యారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చినపుడు తాము కూడా ఈ విధానాన్ని అవలంబిస్తే టీడీపీ నాయకులు ఎక్కడ ఉంటారని ప్రశ్నించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నా మాట్లాడుతూ.. దసరా పర్వదినం రోజున తమ దౌర్జనాలతో గుగ్గిళ్ల శ్రీనును పొట్టకున్నందుకు టీడీపీ వారికి తప్పకుండా శ్రీను ఉసురు కొట్టుకోక మానదు అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హాఫీజున్నీసా ఫిరోజ్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి బద్దూనాయక్, వక్ఫ్ బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి జుబేర్, ఎంపీపీలు మార్కపూడి గాంధీ, రమాదేవి, జడ్పీటీసీ సభ్యులు ఊట్ల నాగమణి, ఏసుపోగు దేవమణి, ఎంపీటీసీ కాకాని స్రవంతి, సర్పంచ్ పరమయ్య, పార్టీ పేట, వత్సవాయి మండలాల అధ్యక్షులు శ్రీనివాసగౌడ్, గుత్తా శంకర్, రాష్ట్ర మహిళా నాయకురాలు సంపతి విజిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మసీదు ప్రారంభం

**కంచికచర్ల(వీరులపాడు):**మహమ్మద్ జామియా మసీదు ఎంతో ప్రాముఖ్యత కలిగినదని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల మండలం పరిటాలలో శిథిలావస్థకు చేరటంతో పునర్నిర్మించిన మసీదును కూటమి నాయకులతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

**ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీఎమ్మెల్యే..**

శిథిలావస్థకు చేరిన మసీదును దాతల సహకారంతో ముస్లింలు ఐక్యంగా పునర్నిర్మించుకోవడం అభినందనీయమని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మహమ్మద్ జామియా మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చన్నారు. ముందుగా ప్రత్యేక నమాజ్‌లో పాల్గొని మతపెద్దలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ కరీముల్లా, మార్త శ్రీను, షేక్ యాకుబ్‌అలీ, ముతావల్లి మహ్మద్ ఖాజా, పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



మసీదు ప్రారంభోత్సవంలో మతపెద్దలతో మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

## నిమజ్జనానికి తరలిన దుర్గమ్మ

**నందిగామ టౌన్:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలందుకున్న దుర్గమ్మ అమ్మవార్లను భక్తులు ఆదివారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. నందిగామ పట్టణంలోని కృష్ణబలిజనగర్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో 11వ వార్షిక దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పదిరోజుల పాటు అమ్మవారికి పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. రాత్రికి పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి తీన్‌మార్ వాయిద్యాలు, భక్తుల కోలాహలం మధ్య అమ్మవారిని పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించి కృష్ణానదిలో నిమజ్జనం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను సైతం నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దొంతిరెడ్డి భరత్, చేజర్ల రమేష్, బలుసుపాటి మురళి, చేజర్ల నరేంద్ర, చెరుకూరి సాయి వేణుకుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కృష్ణబలిజనగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారు

**అమ్మవారి అలంకరణ చీరల వేలం..**

కృష్ణబలిజ నగర్‌లో అమ్మవారికి తొమ్మిది రోజులపాటు అలంకరించిన చీరలకు నిర్వాహకులు సోమవారం వేలం నిర్వహించారు. వేలంలో రూ.24,700లకు భక్తులు అమ్మవారి చీరలను కైవసం చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

## బతుకమ్మకు ప్రత్యేక పూజలు

**పెనుగంచిప్రోలు:** బతుకమ్మ సంబరాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. పెనుగంచిప్రోలు శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శ్రీకోదండ రామాలయం, డౌన్ సెంటర్ వద్ద బతుకమ్మ సంబరాల్లో భాగంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారీచేసి ఆడిపాడారు. అనంతరం మునేరులో నిమజ్జనం చేశారు. అదేవిధంగా ముండ్లపాడు, ముచ్చింతాల గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

**మక్కపేటలో...**

వత్సవాయి మండలం మక్కపేటలో అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, రామాలయాల వద్ద బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు, యువత పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

## సందడిగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**చందర్లపాడు(నందిగామటౌన్):** మండలంలోని చింతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో 1993–96 మధ్య చదువుకున్న విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. అప్పటి ఉపాధ్యాయులు బొండలపాటి అప్పారావు, జూలూరు చంద్రమౌళేశ్వరరావు, జంధ్యాల రామస్వామి శాస్త్రి, రాజ బాలమ్మ, జంధ్యాల రాజ్యలక్ష్మిలను ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు.



# ముగిసిన దేవీ శరన్నవరాత్రులు



శమీపూజలో పాల్గొన్న తిరుపతమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ఈవో కిషోర్‌కుమార్

**పెనుగంచిప్రోలు:** విజయదశమిని పురస్కరించుకుని తొమ్మిదిరోజులుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిశాయి. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో శమీపూజ నిర్వహించారు. తొమ్మిదిరోజులపాటు పూజలందుకున్న అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం మునేరులో నిమజ్జనం చేశారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కిషోర్‌కుమార్, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.పెనుగంచిప్రోలు శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, నవాబుపేట శివాలయంలో శమీపూజ నిర్వహించారు.

**రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు...**

**నందిగామ టౌన్:** విజయదశమి పండుగను నందిగామ నియోజకవర్గ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విజయదశమి పర్వదినం సందర్భంగా అంబారుపేటలోని సత్యమ్మ అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో హరిగోపీనాథ్ పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై మేళతాళాలతో మునేటి తీరానికి ఊరేగింపుగా తీసుకెళ్లి శమీపూజ చేశారు. రంగురంగుల విద్యుద్దీపకాంతులతో శోభాయమానంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అమ్మవారిని దర్శించుకుని పూజల అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. పల్లగిరిగట్టుపై త్రిశక్తి పీఠంలో ఉన్న కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవార్లను అర్చకులు రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి వారి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. పట్టణంలోని శుకశ్యామలాంబ, వాసవీ కన్యకాపరమేశ్వరి, మరిడీ మహాలక్ష్మి అమ్మవారితోపాటు లింగాలపాడు లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి పూజలు చేశారు.



రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తున్న లింగాలపాడు లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారు



అంబారుపేటలో రథోత్సవంలో పాల్గొన్న ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**చందర్లపాడు మండలంలో..**

మండలంలోని అన్ని గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మండలంలోని ఏటూరు గ్రామంలోని సీతాలమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి పూజలు చేశారు.

**జగ్గయ్యపేట పట్టణంలో..**

**జగ్గయ్యపేట అర్బన్ :** విజయదశమి పర్వదిన వేడుకలను జగ్గయ్యపేట పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ఆలయాలు, మండపాల్లో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనమివ్వగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక నకాశీబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గ ఆలయం, అద్దాలబజారులో వెండి దేవాలయం, శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం, దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, చెరువుబజారులోని శ్రీరేణుకా పరమేశ్వరి ఆలయాలతోపాటు కోదాడ రోడ్‌లోని కలకత్తా కాళీమాత విశ్వరూప శివదుర్గాభవాని అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవార్లకు ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక అప్సరా థియేటర్ రోడ్డులోని జమ్మిచెట్టు వద్ద భక్తులు పాల్గొని శమీపూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పట్టణంలోని కోదాడ రోడ్డులోని మండపంలో శ్రీకనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



కోదాడరోడ్డులో అమ్మవారికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు



అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



మిట్టగూడెంలో అమ్మవారిని దర్శించుకున్న పేట ఎమ్మెల్యే తాతయ్య, నాయకులు



పేట ఆనందసాయి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



దుర్గాపురంలో శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు



జయంతిపురంలో శాకంబరీ అలంకరణలో అమ్మవారు

**నాయకుల ప్రత్యేక పూజలు..**

**జగ్గయ్యపేట అర్బన్ :** మిట్టగూడెంలో అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నూకల కుమార్‌రాజా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. స్థానిక నకాశీబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి రథోత్సవంలో మాజీఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొని పూజలు చేశారు.